మళ్లీ కిక్ ఎక్కించనున్న కండల వీరుడు



సల్మాన్‌ఖాన్ హీరోగా సాజిత్ నడియాద్వాలా స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కిక్'. 2014లో విడుదలైన ఈ సినిమా బాలీవుడ్‌లో బ్లాక్‌బాస్టర్‌గా నిలిచింది. ఇప్పటికీ ఈ సినిమాకు అక్కడ ఫ్యాన్స్ ఉన్నారు. అందుకే ఈ సినిమాకు సీక్వెల్ తీసుకురావడానికి సాజిత్ సన్నాహాలు చేస్తున్నారు. అయితే.. ఈ సీక్వెల్‌కి దర్శకుడు ఆయన కాదు. తమిళ దర్శకుడు ఏఆర్ మురుగదాస్ ఆ బాధ్యతను స్వీకరించినట్టు విశ్వసనీయ సమాచారం. నిర్మాణంతో పాటు దర్శకత్వ పర్యవేక్షణ బాధ్యతను సాజిత్ నిర్వహిస్తారని తెలుస్తున్నది. మురుగదాస్ బృందం స్క్రిప్ట్ వర్క్ కూడా పూర్తి చేసినట్టు సమాచారం. ఈ సీక్వెల్‌లో మళ్లీ దేవీలాల్ సింగ్-డెవిల్‌గా సల్మాన్ ప్రేక్షకుల ముందుకు రానున్నట్టు బాలీవుడ్‌లో బలంగా వినిపిస్తున్నది. ఈ ఏడాదే షూటింగ్ ప్రారంభించి, వచ్చే ఏడాది ఈద్ పండుగ కానుకగా సినిమాను విడుదల చేయాలని సాజిత్ నడియాద్వాలా సన్నాహాలు చేస్తున్నారని వినికిడి.

నాన్న మాట నాకెంతో స్ఫూర్తినిచ్చింది

'నాన్న పూరీ జగన్నాథ్ డైరెక్షన్‌లో ఇప్పట్లో నటించకూడదని నిర్ణయించుకున్నాను. నాకు నేను హీరోగా ఎదిగాకే నాన్న దర్శకత్వంలో సినిమా చేస్తా.' అన్నారు ఆకాష్ పూరీ. ప్రతిష్టాత్మకంగా మొదలైన పురుషుల వస్త్రవ్యాపార సంస్థ ఆర్.సి.ట్రెండ్ సెట్టర్స్‌కి ఆయన ప్రచారకర్తగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పూరీ ఆకాష్ పలు ఆసక్తికరమైన విషయాలు చెప్పారు. 'ఈ సంస్థవారు నా దగ్గరకు వచ్చినప్పుడు నేను ప్రచారకర్తగా కరెక్ట్ కాదని వాళ్లకు చెప్పాను. ఎందుకంటే నేనెప్పుడూ క్యాజువల్స్‌లోనే ఉండటానికి ఇష్టపడతాను. కానీ వీళ్ల మెన్స్‌వేర్ బ్రాండ్స్ చూశాక వీళ్ల ప్లానింగ్, లక్ష్యం నాకర్థమైంది. అందుకే ఒప్పుకున్నాను. రీసెంట్‌గా బ్రాండ్‌ను లాంచ్ చేస్తూ ఇచ్చిన ప్రకటనకు మంచి స్పందన వచ్చింది' అని తెలిపారు ఆకాష్. ఇంకా చెబుతూ ' 'చిరంజీవిగారు చేసిన చాలా సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. కానీ ఆయన నటుడిగా మాత్రం ఎప్పుడూ ఫ్లాప్ కాలేదు..' అని మా నాన్న చెప్పిన మాట నాకెంతో స్ఫూర్తినిచ్చింది. నా సినిమాలు ఫ్లాపులైనా నటుడిగా నేను ఫ్లాప్ కాలేదు. కచ్చితంగా ఫ్యూచర్‌లో మంచి సినిమాలు చేస్తాను. కథలు వింటున్నాను. ఓ లవ్‌స్టోరీ, ఓ యాక్షన్ సబ్జెక్ట్‌లను ఓకే చేశాను. ఇకనుంచి అందరికీ నచ్చే సినిమాలే చేస్తా' అని తెలిపారు ఆకాష్. నాన్న పూరీ జగన్నాథ్ 'డబుల్ ఇస్మార్ట్', బాబాయ్ 'వెయ్ దరువెయ్' సినిమాలకోసం తాను కూడా ఆతృతగా ఎదురు చూస్తున్నానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

అలాంటి వ్యక్తిని నేను చూడలేదు

'సినిమా సమష్టి కృషి. ఒకరి ఆలోచనతో మొదలైనా.. టీమ్ మొత్తం మనసుపెట్టి పనిచేస్తేనే సినిమా రూపొందుతుంది. అందులో ఏది బావున్నా ఆ క్రెడిట్ అందిరిదీ. ఈ నిజం సంపత్ నందికి బాగా తెలుసు.' అంటూ కొనియాడింది తమన్నా భాటియా. 'ఓదెల 2' సినిమాకు సంబంధించిన ఆమె ఫస్ట్ లుక్‌ని శివరాత్రి సందర్భంగా విడుదల చేశారు. ఆ లుక్‌కి విశేష స్పందన రావడంతో ఆ చిత్ర సమర్పకుడు సంపత్ నంది సోషల్ మీడియా వేదికగా ఆనందం వ్యక్తం చేశారు. తమన్నా లుక్ అద్భుతంగా రావడం వెనుక ఎవరెవరి కృషి ఉందో, అందర్నీ పేరుపేరున అభినందిస్తూ పోస్టు పెట్టారు. డిజైనర్ నీతా లుల్లా నుంచి తమన్నా పర్సనల్ స్టాఫ్ వరకూ అందరికీ థ్యాంక్స్ చెప్పారు. ఈ నేపథ్యంలోనే తమన్నా సంపత్ నంది పోస్ట్‌పై స్పందించింది. ' నా 19ఏళ్ల కెరీర్‌లో సంపత్ నంది లాంటి వ్యక్తిని చూడలేదు. సంస్కారానికి మారు పేరు తను. 'ఓదెల 2'లో నా గెటప్ వెనుక ఎంతో మంది శ్రమ ఉంది. వారందరికీ ఈ సందర్భంగా థ్యాంక్స్ చెప్పుకుంటున్నాను. ఈ లుక్ విషయంలో వచ్చినంత స్పందన ఇప్పటి వరకూ నా ఏ లుక్ విషయంలోనూ రాలేదు. ఇలాంటి మంచి ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు ఆనందంగా ఉంది' అంటూ చెప్పుకొచ్చింది మిల్కీబ్యూటీ.

ముగ్గురు చెల్లెళ్ల అన్నయ్యగా..

'జగదేకవీరుడు-అతిలోక సుందరి'లోని వినోదం, 'హిట్లర్'లోని సెంటిమెంట్ రెండూ కలిస్తే 'విశ్వంభర'. ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్న మాట ఇది. చిరంజీవి చాలాకాలం తర్వాత చేస్తున్న సోషియో ఫాంటసీ సినిమా ఇది. ఊహలకందని కథ, కథనాలతో సృష్టి, స్థితి, లయ.. ఈ మూడింటి నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని వినికిడి. ఓవైపు సమకాలీన సమాజంలో కథ నడుస్తూ.. మరోవైపు మానవాతీత శక్తులతో చిరంజీవి పోరాటాలు చేయడం ఇందులో కొత్తగా ఉండే అంశం అని సమాచారం. చిరంజీవికి జోడీగా త్రిష నటిస్తున్నారు. ఇదిలావుంటే.. కథ రీత్యా ఇందులో చిరంజీవికి ముగ్గురు చెల్లెళ్లుంటారని తెలిసింది. ఆ ముగ్గురిలో ఓ చెల్లెలిగా 'నాని గ్యాంగ్‌లీడర్'ఫేం సురభి నటిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.70శాతం గ్రాఫిక్స్‌తో చిరంజీవి కెరీర్‌లోనే అంత్యంత భారీ బడ్జెట్ సినిమాగా యూవీ క్రియేషన్స్‌వారు ఈచిత్రాన్ని నిర్మిస్తున్నారు. కథ డిమాండ్ మేరకు 13 భారీ సెట్లను కూడా నిర్మిస్తున్నారట. వశిష్ట దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా విడుదల కానున్న విషయం తెలిసిందే.

మహారాణి రుక్మిణీదేవిగా..



శ్రీవిష్ణు కథానాయకుడిగా రూపొందుతోన్న 'శ్వాగ్' చిత్రంలో రీతూవర్మ కథానాయికగా నటిస్తున్నది. ఈ రోజు ఆమె పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఈ సినిమాలోని ఆమె పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం ఓ వీడియోను విడుదల చేశారు. ఇందులో ఆమె వింజమర వంశంలోని మహారాణి రుక్మిణీదేవిగా నటించారు. విష్ణు, రీతూ పాత్రల కామెడీ సంభాషణతో ఈ వీడియో ఆద్యంతం సాగింది. ఈ వీడియో ద్వారా మేకర్స్ ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మహారాణి రుక్మిణీదేవిగా ఆమె పాత్ర, గెటప్ అన్నీ ఆసక్తికరంగా ఉంటాయని మేకర్స్ తెలిపారు. హసిత్ గోలి దర్శకుడు. టి.జి.విశ్వప్రసాద్ నిర్మాత. ఈ చిత్రానికి కెమెరా: వేదరామన్ శంకరన్, సంగీతం: వివేక్ సాగర్.

సరదా సందర్భాల నేపథ్యంలో

'సేవ్ ది టైగర్స్' వెబ్‌సిరీస్ సీజన్2 ఈ నెల 15 నుండి ఓటీటీలో ప్రసారం కానుంది. మహి.వి.రాఘవ్, ప్రదీప్ అద్వైతం సృష్టించిన ఈ సిరీస్‌కు అరుణ్ కొత్తపల్లి దర్శకుడు. ప్రియదర్శి, అభినవ్ గోమఠం, చైతన్యకృష్ణ, పావని, జోర్దార్ సుజాత, శ్రీకాంత్ అయ్యంగార్, గంగవ్వ, వేణు యల్దండి, సీతర్ కపూర్, పావని గంగిరెడ్డి, దేవయాని, దర్శన బానిక్, హర్షవర్ధన్ ప్రధాన పాత్రధారులు. ఈ సిరీస్ ప్రీరిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఇందులో నటీనటులంతా కథను ఓన్ చేసుకొని నటించారని, జీవితాల్లో జరిగే సరదా సందర్భాల నేపథ్యంలో ఓ కామెడీ షో చేయాలనే ఆలోచన నుంచి పుట్టుకొచ్చిందే 'సేవ్ ద టైగర్స్' అని, దీనితో ఆపకుండా మరిన్ని సీజన్స్ చేయాలనుందని మహి.వి రాఘవ అన్నారు. ఎలాంటి అంచనాలు లేకుండా చూడటంవల్ల తొలి సీజన్ అందరికీ నచ్చిందని, అంచనాలతో చూసినా ఈ సెకండ్ సీజన్ నచ్చుతుందని దర్శకుడు అరుణ్ పేర్కొన్నారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు.

ఆయనది మంచి మనసు

ప్రఖ్యాత నటుడు కమల్‌హాసన్‌కు హీరో విశాల్ ధన్యవాదాలు తెలియజేశారు. దక్షిణభారత చలనచిత్ర నటీనటుల సంఘం(నడిగర్ సంఘం) భవన నిర్మాణం కోసం కమల్‌హాసన్ కోటి రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ చెక్‌ను హీరో కార్తీకి అందజేశారు. దీనికి సంబందించిన ఫొటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. నడిగర్ సంఘం ప్రధాన కార్యదర్శి విశాల్ ఈ సందర్భంగా కమల్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. 'ఈ భవన నిర్మాణం అనుకున్నప్పట్నుంచీ కమల్ మా వెంటే ఉంటూ మమ్మల్ని ప్రోత్సహిస్తూనే వున్నారు. భవన నిర్మాణం చేయాలని నిర్ణయించిన తొలినాళ్లలో కోటి రూపాయలు విరాళంగా సంఘానికి అందించారు. ఇప్పుడు నిధుల కొరత వల్ల నిర్మాణంలో జాప్యం జరుగుతుంటే మళ్లీ మరో కోటి విరాళంగా ఇచ్చారు. సమాజం గురించి ఆలోచించే మంచి మనసు కమల్‌సార్‌ది. అందుకే మాలాంటి ఎందరికో ఆయన ఆదర్శం. దేవుని దయ ఎల్లవేళలా మీపై ఉంటుందిసార్..' అంటూ ధన్యవాదాలు తెలిపారు విశాల్.

ఓ పదిరోజులు కరెంట్ లేకపోతే?

త్రిగుణ్ కథానాయకుడిగా తెలుగు, కన్నడ భాషల్లో రూపొందిన చిత్రం 'లైన్‌మెన్'. వి.రఘుశాస్త్రి దర్శకుడు. పర్పల్ రాక్ ఎంటర్‌టైనర్స్ పతాకంపై తెరకెక్కిన ఈ సినిమా ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. యువహీరో శివ కందుకూరి అతిథిగా ఇచ్చేసి బిగ్ టికెట్‌ని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్‌సభ్యులందరికీ ఆయన శుభాకాంక్షలు అందించారు. 'టీవీలకు, ఫోన్లకు బానిసలుగా మారిపోయాం. ఒక గంట కరెంట్ పోతే బతకలేని పరిస్థితి. అలాంటిది ఓ పదిరోజులు కరెంట్ లేకపోతే ఎలా వుంటుంది? అదే ఈ సినిమా కథ. అన్నీ ఉన్నప్పుడు వాటి విలువ తెలీదు. లేనప్పుడే దేని విలువైనా తెలిసేది. ఈ సందేశమే ఈ సినిమా ద్వారా చెబుతున్నాం. ప్రతి ఒక్కరూ ఈ సినిమా కనెక్ట్ అవుతారు' అన్నారు హీరో త్రిగుణ్. ఇంకా చిత్ర యూనిట్‌తో పాటు డైరెక్టర్ నందినీరెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తదితరులు కూడా మాట్లాడారు. కాజల్ కుందెర్, బి.జయశ్రీ, తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: శాంతి సాగర్ హెచ్.జి, సంగీతం: కద్రి మణికాంత్.

పతంగుల పోటీనే ప్రధానాంశంగా

పతంగుల పోటీ నేపథ్యంలో రానున్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్'. ప్రీతి పగడాల, ప్రణవ్ కౌశిక్, వంశీ పూజిత్ ఇందులో ముఖ్య తారలు. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకుడు. విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేశ్ కొత్తింటి నిర్మాతలు. ప్రముఖ గాయకుడు ఎస్పీ చరణ్ ఇందులో ప్రత్యేక పాత్ర పోషించడం విశేషం. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం వేసవిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇందులోని 'హే.. హలో.. నమస్తే..' అంటూ సాగే ఓ లిరికల్ సాంగ్‌ని హైదరాబాద్ పాతబస్తీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వినూత్నంగా గేయరచయిత చంద్రబోస్, దర్శకుడు అనుదీప్ కేవీలు విడుదల చేశారు. ఈ సందర్భంగా యూనిట్‌కు సభ్యులకు అతిథులిద్దరూ శుభాకాంక్షలు అందించారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్న తాను ఈ పాట నచ్చి, సినిమా నిర్మాణానికి పూనుకున్నానని నిర్మాతల్లో ఒకరైన సంపత్ మక తెలిపారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు.

కామారెడ్డి కుర్రాడి సమస్య

'కామారెడ్డి ప్రాంతానికి చెందిన ఓ కుర్రాడికి ఓ సమస్య వచ్చిపడుతుంది. దాని పరిష్కారానికి అతడేం చేశాడు? హైదరాబాద్ వచ్చి తన సమస్యను ఎలా పరిష్కరించుకున్నాడు? అనే ప్రశ్నలకు సమాధానమే మా 'వెయ్ దరువెయ్' సినిమా.' అన్నారు దర్శకుడు నవీన్ రెడ్డి. దర్శకుడిగా ఆయన చేసిన తొలి ప్రయత్నం 'వెయ్ దరువెయ్'. సాయిరామ్‌శంకర్, యషా శివకుమార్, హెబ్బాపటేల్ ప్రధాన పాత్రధారులు. దేవరాజ్ పోతూరు నిర్మాత. ఈ నెల 15న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. 'సినిమా రంగంతో మా కుటుంబానికి అనుబంధం ఉంది. నేను పూణే ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో కోర్స్ చేసి, దర్శకుడు సతీశ్ వేగేశ్న వద్ద దర్శకత్వ శాఖలో పనిచేశాను. ఈ సినిమా నిర్మాత దేవరాజ్ గారు అనుకోకుండా పరిచయం అయ్యారు. ఈ కథ ఆయనకి వినిపించాను. నచ్చడంతో సినిమా పట్టాలెక్కింది. 35రోజుల్లో సినిమా పూర్తి చేశాం. ఇంత త్వరగా పూర్తి చేయగలిగామంటే కారణం, ప్రీప్రొడక్షన్ వర్క్‌కి ఎక్కువ సమయం కేటాయించడమే. నిర్మాత దేవరాజ్, హీరో సాయిరామ్‌శంకర్‌ల సహకారం వల్లే ఇదంతా సాధ్యమైంది' అన్నారు నవీన్‌రెడ్డి. కథ సీరియస్ మోడ్‌లో ఉన్నా వినోదానికి ఢోకా ఉండదని, భీమ్స్ సంగీతం హైలైట్‌గా నిలుస్తుందని, హీరోయిన్స్ పాత్రలకు కూడా ప్రాధాన్యత ఉంటుందని ఆయన తెలిపారు.

అది ఆమె జీవన విధానం

ముఖేశ్ అంబానీ భార్య నీతా అంబానీని ప్రశంసలతో ముంచెత్తేసింది అందాలభామ ప్రియాంక చోప్రా. ఇటీవల ముంబయ్ వేదికగా జరిగిన 'మిస్ వరల్డ్ - 2024' వేడుకలో నీతా అంబానీ 'బ్యూటీ విత్ ఎ పర్పస్ హ్యుమానిటేరియన్' అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఈ వేడుకలో ప్రత్యేక వీడియో ద్వారా నీతా అంబానీకి ప్రియాంక శుభాకాంక్షలు అందించారు. 'నేను చూసిన మంచి మనుషుల్లో నీతా అంబానీ ఒకరు. ఏ పనిచేసినా అంకితభావంతో చేయడం ఆమె ప్రత్యేకత. నవ్వుతూ, పదిమంది జీవితాల్లో నవ్వులు పూయిస్తూ జీవించడం ఆమె జీవన విధానం. నేటి యువతకు ఆమె ఆదర్శం. 'బ్యూటీ విత్ పర్పస్' అన్న మాటకు సరైన ఉదాహరణ నీతా అంబానీ' అంటూ ప్రశంసల జల్లు కురిపించింది ప్రియాంక చోప్రా. ఈ వేడుకలో చెక్ రిపబ్లిక్ నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రిస్టినా పిస్కోవా 'మిస్ వరల్డ్' కిరీటాన్ని దక్కించుకున్న విషయం తెలిసిందే.